క్లుప్తంగా

హౌస్ గణేషుడి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు

ఫిరంగిపురం: మండలంలోని హౌస్ గణేషుని పాడు గ్రామ శివారులో ప్రసిద్ధ కొండవీటి రెడ్డి రాజుల కాలంనాటి గణేషుడి విగ్రహాన్ని అగంతుకులు పగలగొట్టారు. దీంతో ఇటీవల మరో నూతన విగ్రహాన్ని దేవదాయ ధర్మదాయ శాఖ ప్రతిష్టించింది. ఆలయ నిర్మాణానికి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ రూ.10లక్షల నిధులు కేటాయించినట్లు ఆ శాఖ ఈవో ఇ.రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ వి.అనుపమ ఉత్తర్వుల మేరకు గొల్లపూడి కార్యాలయం నిధులు మంజూరు చేసిందని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

మహిళా విభాగం కార్యదర్శిగా షేక్ పర్వీన్



మేడికొండూరు: వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా మహిళా విభాగం కార్యదర్శిగా షేక్ పర్వీన్‌ను నియమిస్తూ రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పర్వీన్‌కు పార్టీ నేతలు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరితకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

ఫిరంగిపురం: వేసవిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు పాటించాలని ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యురాలు శ్వేత పేర్కొన్నారు. వేములూరిపాడు గ్రామంలో గురువారం ఫ్యామిలీ పిజీషియన్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 92 మందికి షుగర్, బీపీ, రక్త, మూత్ర పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మందులు అందజేశారు. వైద్యురాలు శ్వేత ప్రజలకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం రామిశెట్టి అంతోనిరాణి, హెచ్ఏ బాబురావు, ఆశ కార్యకర్తలు సుజాత, పద్మ, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, శిలా ఫలకాలను దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ గురువారం ఆవిష్కరించారు. మండల పరిధిలోని ఈమని నుంచి పేరుకలపూడి గ్రామం వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర రూ.127.20 లక్షల వ్యయంతో ఆర్ అండ్ బీ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో రూ.1307.43 లక్షల వ్యయంతో జలజీవన్ మిషన్ పథకం తాగునీటి పైపులైన్ పనులను చుక్కవల్లివారిపాలెంలో ప్రారంభించనున్నామని జెడ్పీటీసీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శృంగారపాటి రత్నం, జిల్లా ఉపాధ్యక్షులు వడ్డేశ్వరపు రజనీకాంత్, పేరుకలపూడి సర్పంచ్ గంపల గంగాధర్, ఈమని పీఏసీఎస్ అధ్యక్షులు నలకుర్తి ఏసుపాదం, నాయకులు జానీబాష, మత్తె ఆనంద్, సంసోనమ్మ, తిమోతి పాల్గొన్నారు.

సీఏఏకు వ్యతిరేకంగా సీపీఎం నిరసన



తాడేపల్లిరూరల్ : పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) పేరుతో దేశ ప్రజల మధ్య మత చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్న బీజేపీ చర్యలను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని నులకపేట, సుందరయ్య ప్రెస్ కాలనీల్లో ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సీఏఏకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాశం రామారావు మాట్లాడారు. దేశ లౌకిక తత్వానికి, మత సామరస్యానికి విఘాతం కలిగించే విధంగా బీజేపీ పాలన సాగిస్తోందని విమర్శించారు. సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివ శంకరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల సమయంలో దేశ ప్రజల దృష్టిని మరల్చేందుకు సీఏఏను మళ్లీ బీజేపీ ముందుకు తెచ్చిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు వేముల దుర్గారావు, అడ్డగట్ల శౌరి భర్తులం, వి.శాస్త్రి, కట్టా మేరి, నీరుడు దుర్గారావు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

గుంటూరు ఈస్ట్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆంజనేయపేట 1వ లైనులో దర్శి నాగచైతన్య తెలంగాణ మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు దాడిచేశారు. నాగచైతన్యను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని నుంచి 14 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పేదల సొంతింటి కల నిజం చేసిన సీఎం జగన్

- ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వకర్త లావణ్య
- వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాల పంపిణీ



నిర్వాసితులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వకర్త లావణ్య

మంగళగిరి: చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నిరుపేదల సొంతింటి కల నిజం చేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వకర్త మురుగుడు లావణ్య కొనియాడారు. గురువారం ఆత్మకూరు వైఎస్సార్ జగనన్న కాలనీలో నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడారు. సొంతిల్లు పొందిన వారంతా సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉంటామని చెప్పడం హర్షనీయమన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా బకింగ్ హామ్ కాలువపై కొద్దిపాటి ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న వారిని ఖాళీ చేయించి, వెంటనే ఆత్మకూరులో రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి, ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఖాళీ చేయించిన ఇళ్లకు విలువ కట్టించి ఇచ్చి, ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇచ్చినట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సెంటున్నర స్థలం ఇస్తే ఇక్కడ రెండు సెంట్లు ఇచ్చి మనస్సున్న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ నిలిచిపోయారన్నారు. రిజిస్ట్రేషన్ ఖర్చులు కూడా ప్రభుత్వమే భరించి, శాశ్వత హక్కులు కల్పించేలా ధ్రువీకరణ పత్రాలును అందజేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వేణుగోపాలస్వామి రెడ్డి, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ డేవిడ్‌రాజు, పట్టణ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మేకా వెంకటరామిరెడ్డి, బొమ్ము శివరామిరెడ్డి, మల్లవరపు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో సమన్వయకర్త లావణ్య, కిలారి రోశయ్య, ఆర్కే, కాండ్రు కమల

ప్రచార జోరులో వైఎస్సార్ సీపీ

తాడేపల్లిరూరల్ : మంగళగిరి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మురుగుడు లావణ్య ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషుతో కలసి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గుంటూరు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కిలారి వెంకట రోశయ్యతో కలసి సీతానగరం, పలు ప్రాంతాల్లో సంక్షేమ పథకాలను వివరించారు. పేదలకు న్యాయం జరగాలంటే వైఎస్సార్ సీపీ ఎన్నికల గుర్తు ఫ్యాన్‌పై ఓటు వేసి, గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు 16వ వార్డులో ప్రచారం

మంగళగిరి: వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మురుగుడు లావణ్య శుక్రవారం ఉదయం 7 గంటలను పట్టణంలోని 16వ వార్డులో ప్రచారం నిర్వహించనున్నట్లు గురువారం ఆమె కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రచారంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొనాలని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త మేకతోటి సుచరిత



పెదలంక పాఠశాల చిన్నారులతో సుచరిత ఆత్మీయ పలకరింపు

తాడికొండ: తుళ్ళూరు మండలంలోని రాయపూడి పెదలంక, హరిశ్చంద్రపురం, బోరుపాలెం గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేకతోటి సుచరిత విస్తృతంగా పర్యటించారు. పెద్దలంకలో ఆమెకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. వరద నీరు బయటకు వెళ్లేందుకు నిర్మించిన చప్టా అసంపూర్తిగా ఉందని, మరో వంద మీటర్లు పొడిగించాలని స్థానికులు సుచరితకు విన్నవించారు. తప్పక సమస్యను పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. కొప్పుల శేషగిరి రావు, కొమ్మినేని అప్పారావు, కొమ్మినేని దత్తు చనుమోలు రామారావు, పుట్టి సుబ్బారావు, మెండెం బాలస్వామి, బిరుదుగడ్డ శేషగిరిరావు, మెండెం రవి, కొప్పుల అంద్రీయప్ప, ఆరేపల్లి జోజి పాల్గొన్నారు.

- హరిశ్చంద్రపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో 32 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సుచరిత మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సంక్షేమం, అభివృద్ధిని చేరువ చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పాలన కొనసాగిందన్నారు. పార్టీ గ్రామాధ్యక్షుడు హరిబాబు, సొసైటీ చైర్మన్‌లు నాయుడు నాగేశ్వరరావు, మున్నంగి కోటిరెడ్డి, గద్దర్ చెన్నకేశవ, నాగరాజు పాల్గొన్నారు.
- బోరుపాలెంలో నిర్వహించిన కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే సుచరిత అందరినీ ఆప్యాయంగా పలకరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తోకల రాఘవ, యాదల కృష్ణయ్య పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి కేఎల్‌యూ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, సమన్వయకర్త సురేష్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైనట్లు విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు తెలిపారు. గురువారం వర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్ మాట్లాడుతూ..ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు కేరళలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరుగనున్న జాతీయ స్థాయి శిబిరానికి తమ విశ్వవిద్యాలయం నుంచి పదిమంది విద్యార్థులు, ఒక ప్రోగ్రాం ఆఫీసర్ ఎంపికైనట్లు చెప్పారు. ఈ శిబిరంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొంటారని తెలిపారు. ఏపీ నుంచి కేఎల్‌యూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాల ప్రదర్శన నిర్వహిస్తారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శిబిరానికి ఎంపికైన వలంటీర్లను వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.చక్రవర్తి అభినందించారు.

సమన్వయంతో పనిచేద్దాం.. వైఎస్సార్ సీపీని గెలిపిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్ రాజు

తాడేపల్లిరూరల్ : వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మంగళగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని జేసీఎస్ గుంటూరు జిల్లా కో–ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్ రాజు అన్నారు. గురువారం దుగ్గిరాల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జేసీఎస్ మండల కన్వీనర్లు, గ్రామ, వార్డు కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథి డేవిడ్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, వాటి లబ్ధిని వివరిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి మాట్లాడారు. మంగళగిరిలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు శృంగారపాటి రత్నం, మండల జేసీఎస్ కన్వీనర్ యేమినేని రవీంద్రబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరపు రజనీకాంత్, నాయకులు జానీబాష, కోటేశ్వరరావు, గోపి, నాగరాజు, ఆనంద్, కాంతారావు, ఈమని పీఏసీఎస్ అధ్యక్షుడు నలకుర్తి యేసుపాదం, సుధాకర్, ఎంపీటీసీ సభ్యులు కూచిపూడి సురేష్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం



వడ్డమాను(తాడికొండ): తుళ్ళూరు మండలం వడ్డమాను గ్రామంలోని వేణుగోపాల స్వామి, ఆంజనేయ దేవస్థానం నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా వల్లంరెడ్డి సుధాకర్ రెడ్డి, కమిటీ సభ్యులుగా జొన్నకూటి శ్రీనివాసరావు, దాసరి అమరనాథ్ బాబు, ఆకారపు నాగలక్ష్మి, గోళ్ళ దేవీకుమారి, దేగల ఏడుకొండలు, పెరికల కోటేశ్వరమ్మలను దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేయించారు. వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు చుండు వెంకటరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు గొట్టం నర్సిరెడ్డి, దేవదాయ సిబ్బంది పాములు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్డు పనులకు భూమి పూజ



రోడ్డు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ, శివరామిరెడ్డి

ఫిరంగిపురం: మండలంలోని 113 త్యాళ్లూరు గ్రామ పొలాలకు వెళ్లే గ్రావెల్ రోడ్డుకు జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ జెడ్పీ నిధులు రూ.10 లక్షలు మంజూరయ్యేలా కృషి చేశారు. గురువారం గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మేకతోటి సుచరిత చొరవతో జెడ్పీ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా నిధులు మంజూరు చేశారని తెలిపారు. రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు ఉన్న ఇబ్బందులు తొలగిపోతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు శివరామిరెడ్డి, పాలపాటి రఘు, చిట్టా అంజిరెడ్డి, బి.అంజిరెడ్డి, చేవూరి రామ మోహన్‌రెడ్డి, ఎస్, నాగిరెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, చేవూరి సాంబిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పి.కొండారెడ్డి, ఒ.సాంబయ్య, నాగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి కేఎల్‌యూలో మహిళా దినోత్సవాలు



పోస్టర్ విడుదల చేస్తున్న వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ, డీన్ శ్రీనాథ్, డాక్టర్ రూతు రమ్య

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్‌లోని కేఎల్ యూనివర్సిటీలో శుక్ర, శనివారాల్లో మహిళా దినోత్సవాలు నిర్వహించనున్నట్లు వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేఎల్‌యూ ప్రతి సంవత్సరం ఫెమ్ ఫ్లేయర్ పేరుతో మహిళా దినోత్సవాలు రెండు రోజులు అంతర్జాతీయ స్థాయిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలలో 150 టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్యక్రమాలను జరుపనున్నట్లు తెలిపారు. సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నామని చెప్పారు. ఆయా కళాశాలల్లో చదివే బాలికలు, మహిళలు ఈ వేడుకల్లో పాల్గొనాలని ఫెమ్ ఫ్లేయర్ చైర్మన్ పర్సన్ డాక్టర్ కె.రూతు రమ్య కోరారు. అనంతరం మహిళా దినోత్సవ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొ వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, స్టూడెంట్ ప్రోగ్రెషన్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్. హనుమంతరావు, ప్రిన్సిపల్ డాక్టర్ పీకే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సి-విటమిన్ మాత్రలు



ఫిరంగిపురం: వేమవరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు సి–విటమిన్ మాత్రలు గురువారం హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ బలకీర్తి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఫ్లోరోసిస్ లక్షణాలు, నివారణను వివరించినట్లు తెలిపారు. ఫ్లోరోసిస్ నీరు, ఉప్పు కలిపిన చిరుతిండ్లు, పొగాకు వల్ల దంతాలు పసుపు రంగులోకి మారతాయని చెప్పారు. వీటి నివారణకు విటమిన్ –సి కలిగిన పండ్లు, మాత్రలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దివి కమలేమోహన్, శేషు రవికుమార్ పాల్గొన్నారు.

113త్యాళ్లూరు సర్పంచ్‌గా రోశయ్య

ఫిరంగిపురం: 113 త్యాళ్లూరు గ్రామ సర్పంచ్‌గా మీసాల రోశయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సర్పంచ్‌గా చుక్కా రూతు ఒప్పందం మేరకు పనిచేశారు. జిల్లా పంచాయతీ శాఖాధికారుల ఉత్తర్వుల మేరకు రోశయ్య సర్పంచ్‌గా నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు చేవూరి రామమోహన్‌రెడ్డి, పి.సింగారెడ్డి రోశయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. సాంబిరెడ్డి, లక్ష్మారెడ్డి, పాలపాటి రఘు, పి.కొండారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రాజశేఖరరెడ్డి, నాగేశ్వరరావు, తొమ్మిది మంది వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

సామాజిక భవనాల నిర్మాణం అభినందనీయం

మంగళగిరి: నగర పరిధిలో పలు సామాజిక భవనాలు నిర్మించడం అభినందనీయమని ఆయా సామాజిక వర్గాల నాయకులు కొనియాడారు. గురువారం ఐబీఎస్ ప్రెస్ క్లబ్ భవన్‌లో దేవాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చిన్న సామాజిక వర్గాలను సైతం గుర్తించి, సామాజిక భవనాలు నిర్మించాలనే ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆలోచన అభినందనీయమన్నారు. తమ సామాజిక వర్గానికి స్థలం కేటాయించడం సంతోషకరమన్నారు. స్థలం కెటాయించిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే వాల్మీకి బోయ కమ్యూనిటి హాలుకు స్థలం కేటాయించడంపై సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సింగిల్ నంబరు ఆట నిర్వాహకుడి అరెస్టు

గుంటూరు ఈస్ట్ : సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అరండల్‌పేట 14వ లైనులో దాసరి సత్యనారాయణ సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం అతనిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని నుంచి రూ. 1,350లు నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

పాఠకులకు విలువైన సేవలు అందించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు విలువైన సేవలు అందించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. పుస్తకాలు, గ్రంథాలకు సంబంధించి విభాగాలను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. పాఠకులు, ఉద్యోగార్థులు, మహిళలు, సీనియర్ సిటిజన్లతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట గ్రంథ పాలకులు బి.శకుంతల, పి.సత్య శిరీష, సిబ్బంది కోటేశ్వరి, పి.సుధాకర్, లక్ష్మి ఉన్నారు.

రైతు కార్మిక ప్రదర్శనకు మద్దతు ర్యాలీ



ర్యాలీ నిర్వహించిన దుగ్గిరాల రైతు సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్ : వ్యవసాయ రంగాన్ని కాపాడాలని, రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ ఢిల్లీలో జరిగే రైతు కార్మిక ప్రదర్శనకు మద్దతుగా గురువారం దుగ్గిరాల మండల కేంద్రంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యవసాయం సంక్షోభంలో పడిందన్నారు. గిట్టుబాటు ధర లేక నష్టాలు వచ్చి రైతులు అప్పుల పాలవుతున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని, అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, రైతు సంఘం ఉపాధ్యక్షుడు మల్కా ములకా శివసాంబిరెడ్డి, మండల రైతు సంఘం కార్యదర్శి వై. బ్రహ్మేశ్వరరావు, కొలు రైతు సంఘం అధ్యక్షులు భీమవరపు అమ్మిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం కొల్లూరు మండల కార్యదర్శి బి. సుబ్బారావు, పోతురాజు పాల్గొన్నారు.

మద్దతు ధరల చట్టం తేవాలి



ప్రసంగిస్తున్న సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు

తాడేపల్లిరూరల్: రైతు పండించే అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం తేవాలని, పంట రుణాలు మాఫీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లి పట్టణం నేతాజీ సెంటర్‌లో కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ముఖ్య అతిథి జొన్న శివశంకరరావు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా రైతులు తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగింపును నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, సీఐటీయూ నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు, ఏఐటీయూసీ నాయకులు తుడిమెల వెంకటయ్య, ఐద్వా నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, కట్టా మేరి పాల్గొన్నారు.

డీఆర్ఎం ఆకస్మిక తనిఖీ

తెనాలిరూరల్: తెనాలి రైల్వేస్టేషన్‌ను విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఆనంద్‌రావ్ పాటిల్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా వచ్చిన ఆయన సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కార్యాలయం, ఇతర రైల్వే విభాగాల కార్యాలయాలు, ఉత్తర క్యాబిన్, స్టేషన్‌లోని ప్లాట్ ఫాంలతో పాటు రైల్వే ట్రాక్‌లను పరిశీలించారు. స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను ఆరా తీశారు. ప్రయాణికుల భద్రత కోసం రైల్వే ట్రాక్‌ల పునరుద్ధరణ, తెనాలి నుంచి గుంటూరు వెళ్లే రైలు మార్గం అభివృద్ధి చేసే అంశాలను అధికారులతో చర్చించారు. ఆయన వెంట స్టేషన్ మేనేజర్ టి.వెంకటరమణ ఉన్నారు.